అంగన్‌వాడీల అవస్థలు

- పని ఒత్తిడిలో ఇబ్బందులు పడుతున్న టీచర్లు
- ఇద్దరు టీచర్ల రాజీనామా
- ఏళ్లు గడుస్తున్నా భర్తీ కాని ఖాళీలు
- అద్దె భవనాల్లో అరకొర వసతులు


తూంకుంటలో ఒకే గదిలో కొనసాగుతున్న రెండు అంగన్‌వాడీ సెంటర్లు

పీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు సమస్యలు వేధిస్తుండడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కేంద్రాలు అద్దె భవనాలు, అరకొర వసతులతో కొనసాగుతుండడం, పలు గ్రామాల్లో నెట్ సరిగా లేక ఆన్‌లైన్ నమోదులో అవస్థలు పడుతున్నారు.

1,251 మంది లబ్ధిదారులు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 30 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మండలంలో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 565 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు వారు 401 మంది, తక్కువ బరువు ఉన్న వారు 25 మంది, గర్భిణులు, బాలింతలు కలిపి 260 మంది ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, బాలామృతం వంటి పోషక పదార్థాలను తీసుకుంటున్నారు.

వసతులు కరువు

మండలంలోని 9 కేంద్రాలు మాత్రమే సొంత భవనంలో కొనసాగుతున్నాయి. ఉచిత భవనాల్లో 19, అద్దె భవనాల్లో 2 ఉండగా, రెండు టీచర్, 4 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తూంకుంట, కల్వరాల గ్రామాల్లో ఒకే గదిలో రెండు రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నూతన భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసినా.. సకాలంలో నిధులు రాకపోవడంతో భవన నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పని ఒత్తిడి పెరగడంతో ఇటీవలే గోవర్ధనగిరిలో ఉన్న ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. సంగినేనిపల్లి, పుల్గర్‌చర్ల, కల్వరాల, పీపనరండ్ల గ్రామాల్లో ఒక్కొక్క హెల్పర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది.

వసతులు కల్పించాలి



మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది, పసిపిల్లలు, కిశోర బాలికలు పలు సందర్భాల్లో ఇబ్బందులకు గురి అవుతున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ప్రతి నెల చెల్లించాల్సిన జీతాలు కూడా సకాలంలో రావడం లేదు. – సుగుణబాయి, అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు, పీపనగండ్ల

ప్రతిపాదనలు పంపించాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతుల కోసం ఉన్నతాధికారులకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. శాశ్వత భవనాల నిర్మాణంతో పాటు ఇబ్బందులు ఉన్న సెంటర్లను గుర్తించి పాఠశాలల అదనపు గదుల్లో ఏర్పాటు చేస్తున్నాం. – బాలీశ్వరమ్మ, ఇన్‌చార్జ్ సీడీపీఓ, పెబ్బేర్ ప్రాజెక్ట్

ఐదేళ్లుగా హెల్పర్ లేదు



తమ సెంటర్‌లో ఐదేళ్లుగా హెల్పర్ పోస్టు భర్తీ చేయకపోవడంతో సెంటర్ నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కిశోర బాలికలు, తక్కువ బరువు ఉన్న పిల్లలను సంరక్షించడంలో హెల్పర్ సాయం ఎంతో ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మీటింగ్‌లకు వెళ్లాల్సి వస్తే సెంటర్ మూసేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే హెల్పర్ పోస్టును భర్తీ చేయాలి. – రాధ, అంగన్‌వాడీ టీచర్, సంగినేనిపల్లి

ఒక గదిలో రెండు సెంటర్లు..



ఇరుకైన చిన్న గదిలో రెండు సెంటర్లను కొనసాగిస్తుండడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్యాస్ సిలిండర్ల నిర్వహణ, గుడ్లు, పాలు, పౌష్టికాహారాన్ని భద్రపర్చుకోవడంలో కష్టమవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి తమ సెంటర్లకు నూతన భవనాలను నిర్మించాలి. – పద్మ, అంగన్వాడీ టీచర్, కల్వరాల

కొనసాగుతున్న మధుమేహ పరీక్షలు


తెల్లరాళ్లపల్లిలో వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్ పరిధిలో జరుగుతున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితుల వివరాలను వివరించాలని వారు సిబ్బందికి సూచించారు. షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో ఆరోగ్య పరిస్థితులు తెలిసి దానికి అనుగుణంగా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మండలంలోని 10 సబ్ సెంటర్ల పరిధిలో 1,089 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శశాంక్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాన్‌గల్ ఏపీఎంగా వెంకటేష్‌యాదవ్

పాన్‌గల్: మండల ఐకేపీ నూతన ఏపీఎంగా జిల్లెల వెంకటేష్‌యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సక్రూనాయక్ ఆత్మకూర్ మండలానికి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో వెంకటేష్‌యాదవ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల సహకారం, సిబ్బంది తోడ్పాటుతో ప్రభుత్వం అందించే పథకాలు ప్రతి మహిళ సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేస్తానన్నారు. నూతనంగా విధుల్లో చేరిన ఏపీఎంకు సమాఖ్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి క్రీడా ప్రాంగణం చుట్టూ పెంచిన చెట్లను, క్రీడా ప్రాంగణం బోర్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నీలమ్మ స్పందిస్తూ గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను ధ్వంసం చేశారని తెలియడంతో శుక్రవారం క్రీడా ప్రాంగణం పరిసరాలను పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఎంపీడీఓ గోవింద్‌రావుకు నివేదించామన్నారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా.. తెల్లరాళ్లపల్లి క్రీడా ప్రాంగణం చుట్టూ ఉన్న చెట్లు, బోర్డును ధ్వంసం చేసిన విషయం పంచాయతీ కార్యదర్శి ద్వారా తెలిసిందని, ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని ఖిల్లాఘనపురం కాంప్లెక్స్ హెచ్‌ఎం కాళీదాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాంపల్లి పాఠశాలను ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ నిబంధనల ప్రకారం విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి.. ఇంగ్లిష్ పదాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడు వెంకటస్వామి వాటర్ బాటిళ్లు, పండ్లు పంచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హఫీజుద్దీన్, అక్తర్ పాష ఉన్నారు.

'సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం'



పాన్‌గల్: జిల్లాలోని ప్రతి గిరిజనతండాలో శనివారం జరిగే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. జయంతిని పురస్కరించుకొని ప్రతి గిరిజన తండాలో గ్రామసభలు నిర్వహించి ఆయన చేసిన త్యాగాలు, సేవలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో చిట్టెమ్మ, మాజీ సర్పంచ్ శాంతమ్మ, సీతమ్మ, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

ఉపాధిహామీపై సామాజిక తనిఖీ

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో శుక్రవారం డీఆర్‌డీఓ ఉమాదేవి ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు, అయిన ఖర్చును వివరించారు. రేవల్లి మండలంలో మొత్తం 266 పనులు జరిగగా.. రూ. 3.54కోట్లు కూలీలకు అందాయన్నారు. ఆడిట్‌లో వివిధ గ్రామ పంచాయతీల్లో రూ. 65,293 తేడాలు రాగా ఆయా పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ నరసింహారెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ రహీం, ఏపీఓ నర్సింహ పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ఖిల్లాఘనపురం: తరుచుగా గొడవ పెట్టుకోవడంతో పాటుగా కట్టెతో కొట్టి గాయపరిచిన భర్తపై భార్య ఫిర్యాదు చేయగా శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురంతండాకు చెందిన రాత్లావత్ జయ, భర్త రాత్లావత్ రవికి తరుచుగా గొడవలు జరుగుతుండేవి. కొన్ని రోజులుగా అనుమానంతో భార్యను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టిన మాట్లాడినా పద్ధతి మారకపోవడంతో తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. మరోసారి పెద్దలు మాట్లాడి తిరిగి ఇంటికి పంపారు. ఈ నెల 12 మధ్యరాత్రి సమయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కట్టెతో కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయమై ఆమె తన భర్తపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం


సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ ప్రక్రియను ప్రారంభించిన ఆద్యుడు దామోదరం సంజీవయ్య అని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాజారాంప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం దామోదరం సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్న, కొమ్ము వెంకటస్వామి, మద్దిలేటి, తిరుపతయ్య, వెంకటేష్, రాంబాబు, రమేష్‌చారి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

'సగర శంఖారావం సభను జయప్రదం చేద్దాం'


అమరచింతలో వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సగర సంఘం నాయకులు

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఫిబ్రవరి 16న తలపెట్టిన సగరుల శంఖారావ సభను జయప్రదం చేయాలని జిల్లా హడక్ కమిటీ కన్వీనర్ మోడాల తిరుపతయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సగరులు జిల్లాలోని 15 మండలాలు, మున్సిపాలిటీల నుంచి ప్రతి సగరుడు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పల్లె సత్యనారాయణ, చిలుక సత్యం, పెద్ద నాగులు, స్వామి, చీర్ల జనార్దన్, మురళి, చంద్రాయుడు, గుంటి సత్యం, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించే సగర శంఖారావం కార్యక్రమంలో సగరులు పాల్గొని విజయవంతం చేయాలని సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక సత్యం, మాజీ అధ్యక్షుడు స్వామిసాగర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీకాళికామాత ఆలయ ఆవరణంలో శుక్రవారం సగర శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రాంసాగర్, బాలస్వామి, సత్యనారాయణ, యుగంధర్, రామచంద్రి, రామకృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి


అమరచింతలో అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


కడుకుంట్లలో..


జిల్లాకేంద్రంలో..

సాక్షి, నెట్‌వర్క్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం ఏబీవీపీ, విద్యార్థి సంఘాలు, విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో సంఘీభావం ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని జెఎన్‌టీయూహెచ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో, వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో స్వామి వివేకానంద యూత్, కడుకుంట్లలో నవ భారత్ యూత్ ఆధ్వర్యంలో, అమరచింతలో బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో అమర జవాన్ల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం జవాన్లు చేసిన ప్రాణత్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అర్జున్ సాతర్ల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, బాలు, బంటి, వంశీ, బీజేపీ అమరచింత మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, మేర్వరాజు, క్యామ భాస్కర్, అశోక్‌కుమార్, నరాల నారాయణ, రాకేష్ శెట్టి, మంగ అంజి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అంతా విధ్వంసమే..


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్ పాలనలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎన్నికల సమయంలో అడ్డగోలుగా వేసిన శంకుస్థాపన బండలే ప్రస్తుత ఎమ్మెల్యేకు గుదిబండలుగా మారాయని సింగిల్‌విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, సింగల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాములు నాయక్, కృష్ణయ్య, దిశ కమిటీ సభ్యుడు రవి నాయక్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఓ ఒక్క హామీని నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేస్తున్నా బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా కొన్ని పథకాలు ఆలస్యమవుతున్నప్పటికీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. కార్యక్రమంలో ఆగారం ప్రకాష్, సతీష్ కుమార్, వాస నాగేశ్వర్, విజయలక్ష్మి, అజీమ్, నారాయణ, సోమ్లానాయక్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం పరిశీలన



పీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామం నుంచి వెలగొండ, బుసిరెడ్డిపల్లి గ్రామాల మధ్య చేపట్టాల్సిన రోడ్ల పనులపై శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, పలువురు అధికారులు పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ఈ రోడ్లపై వసతులు మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించారని నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్‌గౌడ్, జూనియర్ ఇంజినీయర్ అంజన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, రైతులు రవీందర్‌గౌడ్, శ్రీకాంత్, ఆంజనేయులు, తిరుపతయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

'ఓటీఎస్'ను వినియోగించుకోవాలి


రుణం చెల్లిస్తున్న రైతులు

కొత్తకోట రూరల్: కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు చెల్లించేందుకు తీసుకొచ్చిన వన్ టైమ్ సెటిల్మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, కొత్తకోట విండో అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. సంఘం నుంచి రాయినిపేటకు చెందిన మహిళా రైతు చంద్రకళ తీసుకున్న దీర్ఘకాలిక రుణాన్ని శుక్రవారం పూర్తిగా చెల్లించి వడ్డీలో రాయితీ పొందినట్లు వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15 వరకు ఈ అవకాశం ఉందని, రైతులు ఉపయోగించుకొని రుణాలను చెల్లించాలని కోరారు. డీసీసీబీ మేనేజర్ ప్రదీప్‌కుమార్, సీఈఓ బాలరాజుచారి, రైతులు భాస్కర్ రెడ్డి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది'

ఖిల్లాఘనపురం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాళీదాస్ అన్నారు. పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకటేష్, హబీబున్నిసాకు శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, గీతాబాయి, విద్యారాణి, సురేందర్‌రెడ్డి, భానుప్రకాష్, క్రిష్ణమోహన్, త్రివేణి, సునీత, రజిత, అంజలయ్య, రామకృష్ణ, శ్వేత, తాజుద్దీన్, ఎమ్మార్సీ సిబ్బంది అర్జున్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


పుల్వామా అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన కొత్తకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగే పోటీల్లో 10 ఫ్రాంచైజీలతో 10 టీమ్‌లు, 24 మ్యాచ్‌లు ఉంటాయి. ఇందులో మొదటి విజేతకు రూ.ఒక లక్ష, రన్నప్‌గా నిలిచిన జట్టుకు రూ.50 వేలు మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి వారి మనువడు హరిన్‌రెడ్డి అందజేస్తారని ప్రకటించారు. ప్రారంభ వేడుకల్లో మొదటగా పుల్వామా దాడిలో మరణించిన జవాన్లకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీ జవాన్ల గొప్పతనాన్ని, దేశ రక్షణలో వారి సేవలను కొనియాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ రాంబాబు, హరిన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, ఎల్లంపల్లి నరేందర్, వేముల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, గుంత శివ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థుల నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉత్తమ విద్యా బోధన చేసిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. కలెక్టర్‌గా స్వామికుమార్, డిప్యూటీ కలెక్టర్ శివశంకర్, జిల్లా విద్యాశాఖ అధికారిగా భారతమ్మ, హెచ్‌ఎంగా అఖిల్‌యాదవ్‌తో పాటు 12 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా కె.వరలక్ష్మి, ఎంఈఓగా సాయిబాబా, డీఈఓగా బి.కృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జీకే శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, ఈశ్వర్, రోజారాణి, సుమిత్ర తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ మహాపడి పూజ


పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండల కేంద్రంలో శుక్రవారం శివ మాలధారులు మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన శివ మాలధారులు తెల్లవారుజామున సమీపంలోని పవిత్ర కృష్ణానది జలాలను జల్దీబిందెలతో తీసుకొచ్చి శ్రీకృష్ణనగర్‌లోని శివాలయంలో స్వామివారిని అభిషేకించారు. పట్టణ పురవీధుల గుండా శివ పల్లకీ, కలశ ఊరేగింపు చేసి ఆలయంలో మహాపడిపూజ నిర్వహించారు. దీంతో శివ నామస్మరణతో ఆలయ ప్రాగణం పులకించింది. గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారి జంగం శివానంద్ పూజలు చేశారు. పూజకు హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని పట్టణానికి చెందిన జరిచీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు వితరణ చేశారు.

జింకను కాపాడిన రైతులు


జింకను ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న రైతులు

ఖిల్లాఘనపురం: అడవిలో నుంచి తప్పిపోయి వ్యవసాయ పొలాలకు వచ్చిన ఓ జింకను వీధికుక్కలు తరుముతున్న సమయంలో గమనించిన రైతులు దానిని రక్షించారు. మండలంలోని మల్కిమియాన్‌పల్లికి చెందిన సత్తిరెడ్డి వ్యవసాయ పొలం వద్దకు ఓ జింకను కుక్కలు తరుముతూ వచ్చాయి. అక్కడే ఉన్న సత్తిరెడ్డి, బుగ్గని బాల్‌రాజు గమనించి కుక్కల బారి నుంచి జింకను రక్షించారు. అనంతరం విషయాన్ని ఫారెస్టు అధికారులు చేరవేయడంతో.. ఫారెస్టు డిప్యూటీ ఫారెస్టు అధికారి భాస్కరాచారి, బీట్ అధికారి నాగేంద్రం ఘటన స్థలానికి వచ్చి గాయపడిన జింకను ఖిల్లాఘనపురంలో పశువైద్యుడితో చికిత్స చేయించారు. అనంతరం జంగమాయపల్లి అడవుల్లో వదిలినట్లు చెప్పారు. జింకను కుక్కల బారి నుంచి రక్షించిన రైతులను ఫారెస్టు అధికారులు అభినందించారు.

పెంట్లవెల్లిలో బంద్ సంపూర్ణం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి పోరాట నాయకుడు ఎర్ర శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతూ మాలల జనాభాను తక్కువ చేసి చూపిస్తూ అనగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ తీరును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెంట్లవెల్లిలో బంద్ చేపట్టడం జరిగిందని, వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్ర శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తలారి హనుమంతు, తిరుపాటి నాగరాజు, మూలె కుమార్, మూలె వెంకటేష్, రామకృష్ణ, మోహన్, సుధాకర్ పాల్గొన్నారు.